ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

కరీంనగర్
5 జిల్లా వార్తలు
బుధవారం 14 ఆగస్టు 2024

ఐడీవోసీ పనులను త్వరగా పూర్తి చేయండి

కరీంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సమీకృత జిల్లా కార్యాలయ సముదాయాలను(ఐడీవోసీ) నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాల (ఐడీవోసీ) నిర్మాణ పనులను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులను నవంబర్ నెలాఖరులోపు పూర్తి చేయాలని అధికారులను, గుత్తేదారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈ సాంబశివరావు, ఎస్ఈ లక్ష్మణ్, ఏఈఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

సమస్యలపై ఏకరువు

- నిధుల కేటాయింపులపై నిలదీత
- అవినీతిపై విచారణకు డిమాండ్
- ఎజెండా అంశాలపై నామమాత్రంగా చర్చ
- ఐదు గంటలపాటు 'బల్దియా' సర్వసభ్య సమావేశం


సమావేశంలో పాల్గొన్న కార్పొరేటర్లు


మాట్లాడుతున్న మేయర్

కరీంనగర్ టౌన్, ఆగస్టు 13: రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్య నిర్వహణ, దోమలు, వీధికుక్కలు, కోతుల బెడదతోపాటు జ్వరాల తీవ్రతను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారంటూ నగర సమస్యలపై పలువురు కార్పొరేటర్లు ఏకరువు పెట్టారు. మరో ఆరు నెలల్లో పదవీకాలం ముగియనుందని, ఇప్పటి వరకు తమ డివిజన్లలో ఆశించిన మేరకు అభివృద్ధి పనులు జరుగలేదని, పలుమార్లు తాము ఇచ్చిన ప్రతిపాదనలను బుట్టదాఖలు చేశారని, నిధుల కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందంటూ అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్లు అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఉదయం 11.10 నుంచి సాయంత్రం 4.10 గంటల వరకు ఐదుగంటలపాటు జరిగిన బల్దియా సర్వసభ్య సమావేశంలో 84 ఏజెండా అంశాలను, 180 టేబుల్ ఏజెండా అంశాలను నామమాత్రంగా చర్చించి వాటికి ఏకగ్రీవ ఆమోదం తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ సమావేశమందిరంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ పాల్గొని పాలకవర్గ సభ్యులకు సమాధానమిచ్చారు. అభివృద్ధి పనులు, టెండర్లలో అవినీతి జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపిస్తామని, అవినీతి జరిగినట్లు రుజువైతే చర్యలు తప్పవని చెప్పారు.


జెండావందనం చేస్తున్న కార్పొరేటర్లు

ఎల్ఎండీకి నీరు విడుదల చేయాలని తీర్మానించాలి

- కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి

లోయర్ మానేరు డ్యామ్‌లో నీటి నిలువలు తక్కువగా ఉన్నందున ప్రతిరోజు ఇవ్వాల్సిన నల్లా నీటిని రోజు విడిచి రోజు ఇస్తున్నామని, ప్రతిరోజు ఇచ్చేందుకు ఎల్ఎండీకి మిడ్‌మానేరు నుంచి నీరు విడుదల చేయాలని కోరుతూ సమావేశంలో తీర్మానం చేయాలని కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి అన్నారు. డ్యామ్ కట్టపై, కింద వాకింగ్ ట్రాక్ పక్కన ఉన్న స్ట్రీట్ లైట్లు వెలుగక పోవడంతో వాకర్స్ ఇబ్బంది పడుతున్నారన్నారు. నగరంలోని చికెన్ సెంటర్ల వ్యర్థాలను తరలించేందుకు టెండర్లు నిర్వహించగా 40 లక్షలతో ఒకరు ముందుకు వచ్చారని, ఆయనకు వర్క్ ఆర్డర్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కమిషనర్ స్పందించి చికెన్ వ్యర్థాల టెండర్ల విషయంలో విచారణ జరుపుతున్నామని, త్వరలోనే కాంట్రాక్టు దక్కించుకున్న వారికి టెండర్ ఇస్తామని ప్రకటించారు. నగరంలో వీధికుక్కలు ప్రజలపై దాడులు చేస్తున్నాయని, వీధికుక్కల బెడదను తగ్గించాలని కోరారు.

ఎల్ఆర్ఎస్ నిధుల వివరాలెందుకు ఇవ్వడం లేదు

- మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్

ఎల్ఆర్ఎస్ ద్వారా కార్పొరేషన్‌కు ఎన్ని నిధులు వచ్చాయని అడిగితే ఎందుకు వివరాలివ్వడం లేదని, ఇంతకీ ఎన్ని నిధులు వచ్చాయి.. నిబంధనల మేరకు వాటిని ఖర్చు చేశారా చెప్పాలంటూ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ డిమాండ్ చేశారు. తన వద్దకు ఎల్ఆర్ఎస్ వివరాలు రాలేదని కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ సమాధానమిచారు. మేయర్ సునీల్‌రావు జోక్యం చేసుకొని 2.5 కోట్ల నిధులు వచ్చాయని, ప్రభుత్వ నిబంధనల మేరకు ఆయా డివిజన్లకు 30 శాతం నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. 30 శాతం నిధులు ఇవ్వడం లేదని రవీందర్‌సింగ్ అసంతృప్తి వ్యక్తం చేయగా, ఆమేరకు మంజూరు చేస్తామని మేయర్ తెలిపారు.

కాలం చెల్లిన వాహనాలతో కార్మికులు ఎలా పనిచేస్తారు...

- కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్

నగరపాలక సంస్థకు చెందిన పారిశుద్య వాహనాలు పూర్తిగా చెడిపోయాయని, కాలం చెల్లిన వాహనాలతో కార్మికులు ఎలా పని చేస్తారని కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ ప్రశ్నించారు. కార్మికుల కోసం కరీంనగర్‌లో ఈఎస్ఐ హాస్పిటల్ ఏర్పాటు చేయించాలని డిమాండ్ చేశారు. తన డివిజన్ పరిధిలోని శ్రీరామబుక్‌స్టాల్ ఎదుట రోడ్ ఇప్పటికీ బాగు చేయలేదని, చేస్తారా లేదా అని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఇళ్లలోకి నీరు వస్తే చూసిపోయారేగానీ తట్టెడు ఇసుక కూడా డ్రైనేజీ నుంచి తీయలేదని విమర్శించారు. రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం చేస్తామని, కొత్త వాహనాలను కొనుగోలు చేస్తున్నామని మేయర్, కమిషనర్ తెలిపారు.

నల్లా కనెక్షన్లకు డబ్బులు వసూలు చేయడం అక్రమం

- కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్

నగర పాలక సంస్థలో విలీనమైన గ్రామాలకు సంబంధించిన డివిజన్లలో ప్రజల నుంచి కొత్తగా ఆన్‌లైన్ పేరిట నల్లా కనెక్షన్లకు డబ్బులు వసూలు చేయడం అక్రమమని కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. విలీన గ్రామాల సమస్యలపై ఆయన పలు సమస్యలను లెవనెత్తారు. నూతనంగా కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికే ఆన్‌లైన్ చార్జీలు వసూలు చేయాలని ఆయన అన్నారు. విలీన గ్రామాల డివిజన్లకు ఒక్కో ట్రాక్టర్ కేటాయించాలని కోరారు. ఎనిమిది నెలలుగా కొత్తగా వేసిన కరెంటు పోల్స్‌కు లైట్లు లేవని, ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు.

ఎందుకింత వివక్ష..

- కార్పొరేటర్ మెండి శ్రీలతచంద్రశేఖర్

అన్ని డివిజన్లకు సమానంగా నిధులు కేటాయించామని చెప్పడం అవాస్తవమని, తన డివిజన్‌కు ఎన్ని నిధులు కేటాయించారని, స్మార్ట్‌సిటీలో పెట్టి టెండర్ నిర్వహించిన పనులను కూడా ఎందుకు రద్దు చేయించారని కార్పొరేటర్ మెండి శ్రీలతచంద్రశేఖర్ ప్రశ్నించారు. దీనికి మేయర్ స్పందిస్తూ తనకు ప్రతిపాదనలు ఇస్తే తప్పకుండా పనులు పెడతామని, ప్రతిపాదనలు ఇస్తే నిధులు కేటాయిస్తామని చెప్పారు.

స్లమ్ ఏరియాను అభివృద్ధి చేయండి

- కార్పొరేటర్ గంట కల్యాణి శ్రీనివాస్

తన డివిజన్‌లో స్లమ్ ఏరియా ఉందని, రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేయాలని ప్రపోజల్స్ ఇస్తే బుట్టదాఖలు చేశారని, జనరల్ ఫండ్, ఇతర నిధుల్లో కూడా తమ డివిజన్‌కు అన్యాయం చేశారని కార్పొరేటర్ గంట కల్యాణి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు దోమలతో అనారోగ్యాలకు గురవుతున్నా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. దోమల నివారణ చర్యలు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు.

నిధుల కేటాయింపులో అన్యాయం చేశారు

- కార్పొరేటర్ కచ్చు రవి

శివారు ప్రాంతంలో ఉన్న తన డివిజన్‌లో అభివృద్ధి జరుగ లేదని, నిధుల కేటాయింపులో అన్యాయం చేశారని కార్పొరేటర్ కచ్చు రవి ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్‌సిటీ, సీఎం హామీ పనులు కూడా విద్యానగర్ వరకు చేసి వదిలి వేశారని, జనరల్ ఫండ్ కూడా కేటాయించక పోవడంతో రోడ్లు, డ్రైనేజీలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇప్పటికైనా నిధులు కేటాయించాలని కోరారు. మేయర్ మాట్లాడుతూ నిధులు కేటాయించి పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

అవినీతిపై విచారణ జరిపించండి

- కార్పొరేటర్ బండారి వేణు

ఇంటిగ్రేటెడ్ మార్కెట్, జంక్షన్లలో జరిగిన అవినీతిపై ఇతరశాఖల అధికారులతో విచారణ జరిపించాలని కార్పొరేటర్ బండారి వేణు డిమాండ్ చేశారు. తన డివిజన్‌లోని ఆదర్శ శ్మశానవాటికను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కనీస సౌకర్యాలు లేవని, అపరిశుభ్రంగా మారిందని, వెంటనే అభివృద్ధి చేయాలని కోరారు. అవినీతిపై ఇతరశాఖల అధికారులతో విచారణ జరిపిస్తామని, శ్మశాన వాటికకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని కమిషనర్, మేయర్ హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనుల్లో అవినీతిపై విచారణ

- కుక్కలు, కోతుల సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు
- ప్రతి డివిజన్‌లో కొత్తగా 12 హైమాస్ట్ లైట్ల ఏర్పాటు
- మేయర్ యాదగిరి సునీల్‌రావు

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వివిధ పథకాల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో అవినీతి జరిగినట్లు వస్తున్న ఆరోపణలపై ప్రత్యేక విచారణ జరిపించి, ఒకవేళ అవినీతికి పాల్పడినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరినట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. మంగళవారం నగరపాలక సంస్థ సమావేశమందిరంలో జరిగిన పాలకవర్గ సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా పలువురు కార్పొరేటర్లు జంక్షన్లు, మార్కెట్ల నిర్మాణాల్లో అవినీతి జరిగిందంటూ చేసిన ఆరోపణలపై వివరణ ఇచ్చారు. పాలకవర్గ సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించ డంతోపాటు ప్రజలకు సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని అన్నారు. 80 ఎజెండా, 180 టేబుల్ ఎజెండా అంశాలకు పాలకవర్గం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చెప్పారు. నగరంలో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచేందుకు కార్మికులపై భారం పడకుండా యంత్రాలతో పనులు చేపడుతున్నామన్నారు. చాలా సంవత్సరాల క్రితం కొనుగోలు చేసిన వాహనాలు తరచుగా రిపేర్లకు వస్తున్నందున వాటి స్థానంలో కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని నిర్ణయించామని తెలిపారు. నాలుగు కోట్లతో కొత్తగా 38 చెత్త ట్రాక్టర్లు, మరో 10 స్వచ్ఛ ఆటోలను, నీటి సరఫరాకు 10 ట్యాంకర్లతో కూడిన ట్రాక్టర్లు కొంటామన్నారు. 15 ఫైనాన్స్ నిధులు 6 కోట్లతో 60 డివిజన్లలో ఒక్కో డివిజన్‌కు 12 చొప్పున హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 25 కోట్లతో 60 డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులు చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. వినాయకచవితి, బతుకమ్మ, దసరా పండుగలకు విస్తృత ఏర్పాట్లు చేసేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధంచేసి టెండర్లు నిర్వహించాలని అధికారులను ఆదేశించినట్లు మేయర్ సునీల్‌రావు ప్రకటించారు. 2.5 కోట్ల ఎల్ఆర్ఎస్ నిధులను నిబంధనల మేరకు ఆయా డివిజన్లకు కేటాయిస్తామని అన్నారు. మున్సిపల్ చట్ట ప్రకారంగా కుక్కలకు బర్త్‌కంట్రోల్ ఆపరేషన్లను చేస్తున్నామని, సమస్య తీవ్రంగా ఉన్నందున ప్రత్యామ్నాయం కోసం తీర్మానించి ప్రభుత్వానికి పంపిస్తామని మేయర్ స్పష్టం చేశారు. సీఎం హామీ పనులను నెలాఖరులోగా ప్రారంభించి అక్టోబరులో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పార్కింగ్ స్థలాలు లేని ఫంక్షన్‌హాల్స్, షాపింగ్ మాల్స్‌కు నోటీసులు జారీ చేస్తామన్నారు. గంజ్ హైస్కూల్ హెరి టేజ్ బిల్డింగ్ పనుల కోసం టెండర్ ప్రక్రియను చేపడతామని, ఐదు రూపాయల అన్నపూర్ణ భోజనాన్ని నాకా చౌర స్తాలో ప్రారంభిస్తామని మేయర్ తెలిపారు. 15 రోజులకొకసారి ఫాగింగ్ చేయడంతోపాటు ప్రత్యేక పారిశుధ్య పనులను చేపట్టి జ్వరాల నియంత్రణపై దృష్టిసారిస్తామన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఈఈ యాదగిరి, ఇన్‌చార్జి ఏసీపీ వేణు, ఆర్ఐలు ఆంజనేయులు, గణేశ్, డీఈలు, ఏఈలు, టీపీబీవోలు తెలిపారు.

ప్లాస్టిక్ నిర్మూలనకు కృషిచేయాలి

- కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్

నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిర్మూలించాలని కార్పొరేటర్ జంగిలి ఐలేందర్‌యాదవ్ అన్నారు. ప్లాస్టిక్‌ను నిర్మూలిస్తే చెత్త డంపింగ్ సమస్య తీరుతుందన్నారు.

కార్మికులు సమ్మె చేయడం మున్సిపల్ వైఫల్యమే

- కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్

పారిశుధ్య నిర్వహణకు అవసరమైన వాహనాలను మరమ్మతులు చేయక పోవడంతో కార్మికులు సమ్మె చేశారు.. ఇది పూర్తిగా మున్సిపల్ అధికారుల వైఫల్యమేనని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ విమర్శించారు. ఇప్పటికైనా వాహనాలకు మరమ్మతులు చేయించాలని, కొత్త వాహనాలను కొనుగోలు చేయాలని, ఇతర కార్మికులకు అందించాల్సిన వస్తువులను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

జెండా ఎగురవేయనున్న మంత్రి శ్రీధర్‌బాబు



కరీంనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జిల్లాలో ఐటీ, పరిశ్రమలు, వాణిజ్యపన్నులశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు జాతీయ పతాకాన్ని ఎగరవేసి గౌరవ వందనం స్వీకరించనున్నారు. వివిధ జిల్లాల్లో ఎవరెవరు పతాకాన్ని ఎగరవేసేది నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి శ్రీధర్‌బాబు కరీంనగర్ జిల్లాలో, మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పెద్దపల్లి జిల్లాలో, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ జగిత్యాల జిల్లాలో, మరో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో జాతీయ పతాకాలను ఆవిష్కరించి గౌరవ వందనాన్ని స్వీకరిస్తారు. జిల్లాకే చెందిన రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సిద్దిపేట జిల్లాలో జాతీయ పతాకాన్ని ఎగరవేస్తారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆగస్టు 15న పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు జాతీయ పతాకాన్ని ఎగరవేసి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ఆయన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు.

బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ


ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

భగత్‌నగర్, ఆగస్టు 13: బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధక్షురాలు చొప్పరి జయశ్రీ ఆధ్వర్యంలో నగరంలో మంగళవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మంగళవారం భగత్‌నగర్‌లో భగత్‌సింగ్ విగ్రహం వద్ద ర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగా బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ మాట్లాడుతూ దేశ ప్రధానినరేంద్ర మోడీ పిలుపు మేరకు ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలన్నారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ హాజరై స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాం క్షలు తెలిపారు. కార్యక్రమంలో గుగ్గిళ్ల రమేష్, వాసు దేవ రెడ్డి, వంగళ శ్రీదేవిపవన్, కాసర్ల లక్ష్మి ఆనంద్, కొలగాని స్వర్ణ శ్రీనివాస్, నిర్మలరెడ్డి, దేశశిల్ప, లావ ణ్య రెడ్డి, సుధావైష్ణవి, సునీత, అరుణ, కొత్తపల్లి అరుణ, కన్నంబ, నాంపల్లి శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

తొమ్మిది నెలలు గడిచినా హామీల అమలు లేదు

- సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న మర్రి వెంకటస్వామి

జమ్మికుంట, ఆగస్టు 13: అధికారంలోకి తొమ్మిది నెలలు గడిచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి విమర్శిం చారు. మంగళవారం జమ్మికుంటలో ఆయన విలేక రులతో మాట్లాడు తూ రాష్ట్ర ప్రభుత్వం అధికార యంత్రాగంపై ఇప్పటి వరకు పట్టు సాధించ లేదన్నారు. గత ప్రభుత్వం ఎలాంటి పరిపాలన కొనసాగించిందో, ప్రస్తుతం అదే రీతిలో కొనసాగ తోందన్నారు. గత ప్రభుత్వంపై వచ్చిన అవినీతి ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యే లను ఎలా తీసుకుందో కాంగ్రెస్ ప్రభుత్వం అదే ధోరణి అవలంబిస్తోందన్నారు. ఏ పార్టీ ద్వారా గెలిచినా ప్రజల పక్షాన ఉంటూ ప్రతిపక్ష పాత్ర పోషించాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పోరాటాలు చేసి నిధులు సాధించి అభివృద్ధి చేయాలన్నారు. పెట్టుబడి దారులుగా, దోపిడీ దారులుగా ఎమ్మెల్యేలు ప్రవర్తిస్తున్నారని మండి పడ్డారు. అవినీతి, అక్రమాలను కప్పి పుచ్చుకోవడం కోసమే ఎమ్మెల్యేలు పార్టీ మారుతున్నార న్నారు. ఎన్నికల్లో కోట్ల రూపాయాలు ఖర్చు చేయడం, అంతకు మించి డబ్బులు సంపాదించడం పరిపాటిగా మారిందన్నారు. ఈ నెల 20న హుజూరాబాద్‌లో కమ్యూనిస్టు జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తామన్నారు. సమావేశాలకు రాష్ట్ర నాయకులు కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో కార్యవర్గ సభ్యుడు సృజన్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిని అశోక్, కరీంనగర్ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి గజ్జి ఐలయ్య, ఏఐఎఫ్ జిల్లా కన్వీనర్ కళ్యాణ్, లింగంపల్లి అచ్యుత్, రాజేష్, లోహిత్, భాస్కర్, శివ, వెంకటేష్, ప్రణయ్, సమ్మయ్య, అక్షిత్, సాయి పాల్గొన్నారు.

డాక్టర్ హత్య కేసులో నిందితుడిని శిక్షించాలి



నగరంలో నిరసన తెలుపుతున్న డాక్టర్లు

సుభాష్‌నగర్, ఆగస్టు 13: పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ మెడికల్ కాలేజీలో రాత్రి విధులు నిర్వహిస్తున్న జూనియర్ డాక్టర్‌పై లైంగికదాడికి పాల్పడి హత్యచేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌక్‌లో కొవ్వొత్తు లతో డాక్టర్లు మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహి ంచారు. మహిళా డాక్టర్లకు రక్షణ కల్పించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావతృతం కాకుండా ఉండేం దుకు దోషులను కఠినంగా శిక్షించడంతోపాటు డాక్టర్లకు రక్షణ కల్పించే విధంగా చట్టం రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇలాంటి ఘటనలు జరిగితే వైద్యులంతా విధులు బహిష్కరించడంతోపాటు అత్యవసర సేవలను నిలిపివేస్తామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో డాక్టర్లు గౌతమ్, శరణ్‌సాయి, విజయలక్ష్మి, ప్రదీప్, రితేష్ తదితరులు పాల్గొన్నారు.

- నేడు గంటపాటు ఓపీ సేవలు బంద్

పశ్చిమ బెంగాల్‌లోని ఆర్‌జీ మెడికల్ కాలేజీలో డాక్టర్ హత్యకు నిరసనగా బుధవారం జూనియర్ డాక్టర్లు సేవలు నిలిపివేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రితోపాటు ప్రతిమ, చల్మెడ మెడికల్ కాలేజీల్లో జూనియర్ డాక్టర్లు గంటపాటు ఓపి సేవలు అందించరు. పేషంట్లకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 13: ఒంటిరితనంతో పాటు అనారోగ్య సమస్యలు భరించలేక వృద్ధుడు కొప్పు శంకర్ (72) ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటకు చెందిన శంకర్ తన భార్య పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో ఉండేవారు. భార్యాపిల్లలతో గొడవ పడి 20 ఏళ్ల కిందట శంకర్ తన స్వగ్రామానికి వచ్చి చిన్నపాటి రేకుల షెడ్డులో ఒంటరిగా జీవిస్తున్నాడు. గ్రామంలో పశువుల కాపరిగా కొనసాగుతుండేవాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన శంకర్ ఒంటరితనం, అనారోగ్యం వల్ల మనస్తాపం చెంది రేకుల షెడ్డులో ఉరివేసుకుని చనిపోయాడు. ఇంటిలో నుంచి దుర్వాసన రావడంతో చుట్టు పక్కల వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. విషయం తెలుసుకున్న మృతుడి భార్య హన్మవ్వ గ్రామానికి చేరుకుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమాకాంత్ తెలిపారు.



వేణుగోపాల్ రెడ్డి

ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవానికి ఆహ్వానం

వీణవంక, ఆగస్టు 13: న్యూఢిల్లీలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవంలో పాల్గొనాలని మండలంలోని ఘన్ముక్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, పదో తరగతి విద్యార్థి బావు శ్రీశాంత్‌కు ప్రత్యేక ఆహ్వానం అందింది. రాష్ట్రంలోని ఐదుగురు ఉపాధ్యాయులు, ఐదుగురు విద్యార్థులకు అవకాశం దక్కింది. వీరు మూడు రోజుల పాటు ఢిల్లీలో పర్యటించి కేంద్ర విద్యాశాఖ మంత్రితో సమావేశంలో పాల్గొంటారు. ఎంపికైన వారిని మోడల్ స్కూల్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసాచారి, సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ రాజీవ్, డీఈవో జనార్దన్‌రావు అభినందించారు.



బావు శ్రీశాంత్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, ఆగస్టు 13: మండలంలోని పోతిరెడ్డిపల్లిలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమతి లేకుండా మానేరు వాగు నుంచి ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్ తరలించారు. పోతిరెడ్డిపల్లికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్ చెవుల అనిల్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తోట తిరుపతి తెలిపారు.

అప్పుల బాధతో వృద్ధుడి ఆత్మహత్య

బోయినపల్లి, ఆగస్టు 13: అప్పులు తీర్చే మార్గం లేక ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన బోయిన పల్లి మండలం కోరెం గ్రామంలో మంగళవారం జరిగింది. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్కాపురం రాజయ్య (60) తన ఇద్దరు కుమారులను ఉపాధి కోసం గల్ఫ్‌కు పంపించాడు. వారిద్దరూ అక్కడ సరైన జీతం లేకపోవడంతో ఇంటికి వచ్చారు. అంతే కాకుండా రాజయ్య కుమార్తె వివాహానికి అప్పు చేశాడు. గల్ఫ్ అప్పులు, కుమార్తె పెళ్లికి చేసిన అప్పులు పెరగడంతో రాజయ్య తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలిపారు. సోమవారం రాత్రి ఇంట్లో నుంచి బయటికి వెళ్లి గ్రామ శివారులో ఉన్న కొండపోచమ్మ వద్ద ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య రాధ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాఖీ పౌర్ణమికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, ఆగస్టు13: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ఆర్టీసీ అదనపు బస్సులు నడిపించనున్నట్లు ఆర్ఎం ఎస్.సుచరిత అన్నారు. మంగళవారం కరీంనగర్ బస్ స్టేషన్ ఆవరణలోని సమావేశ మందిరంలో రీజియన్ పరిధిలోని అన్ని డిపోల మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మహాలక్ష్మి పథకం అమలు, ఈనెల 19న రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు ఈనెల 14న 83 బస్సులు, 16న 58 బస్సులు, 17న 145 బస్సులు మొత్తం 286 బస్సులు నడిపించనున్నామన్నారు. కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 19న 150 బస్సులు, 20న 150 బస్సులు, 21న 140 బస్సులు మొత్తం 440 బస్సులు కలుపుకుని మొత్తం 726 బస్సులు నడిపించేందకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకుని ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సురక్షితమైన ప్రయాణం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటి రీజినల్ మేనేజర్స్ (మెకానికల్, ఆపరేషన్స్) కె.సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, అన్ని డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో బాలుడిపై కుక్క దాడి

చందుర్తి, ఆగస్టు 13 : అంగన్‌వాడీ కేంద్రంలో నాలుగు సంవత్సరాల బాలుడిపై కుక్క దాడి చేసిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని ఒకటవ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన కటకం హరిత తన కుమారుడైన ఆరుష్‌ను మంగళవారం ఉదయం అంగన్‌వాడీకి పంపించింది. ఆరుష్‌తో పాటు మరో బాలుడిని మూత్ర విసర్జన కోసం ఆయా లచ్చవ్వ మూత్రశాల వద్దకు తీసుకువెళ్లింది. బాలుడు మూత్రశాల డోర్ తీసి లోపలికి వెళ్లగానే, అందులోనే ఉన్న కుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. ఈ సంఘటనలో బాలుడి చెవి భాగంలో తీవ్ర గాయమైంది. బాలుడి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మొదట వేములవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సిరిసిల్ల ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. అంగన్‌వాడీలో కుక్క దాడి చేయడంతో తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు.

గూడెంలో చిన్నారులపై..

ఓదెల: మండలంలోని గూడెంలో మంగళవారం కుక్కల గుంపు స్వైర విహరం చేసి పలువురిపై దాడికి పాల్పడ్డాయి. దీంతో రేగుల ఈశ్వర్ ప్రసాద్, రేగుల వినయ్ అనే చిన్నారుల పొట్టల్లో, చేతులకు గాయాలయ్యాయి. సోమవారం రాత్రి కూడా ఇళ్లలో నుంచి బయటికి వచ్చిన పలువురిపై కుక్కల గుంపు ఆకస్మాత్తుగా దాడి చేసి మరో అయిదుగురు వ్యక్తులను నోట కరిచినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో గ్రామస్తులు రాత్రింబవళ్లు బయటకు రావాలంటే భయందోళనలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుక్కల నివారణ చర్యలు చేపట్టి, గాయాలకు గురైన వారికి గ్రామంలోని వైద్య చికిత్సలు అందించాలని కోరారు.


చెవికి గాయంతో బాలుడు

కథలాపూర్‌లో టెలికాం కేబుల్ చోరీ

కథలాపూర్, ఆగస్టు 13 : మండల కేంద్రంలో మంగళవారం టెలికాం శాఖకు చెందిన కేబుల్‌ను కొందరు వ్యక్తులు ఎత్తుకెళ్లారు. వరద కాలువ పక్కన నుంచి గతంలో భూష ణరావుపేటకు టెలిఫోన్ సదుపాయం కల్పించేందుకు ఈ కేబుల్ వేశారు. అయితే సుమారుజీ ఐదుగురు వ్యక్తులు తాము టెలికాం విభాగానికి చెందిన వారమని పేర్కొంటూ కేబుల్ కోసుకు వెళ్లారు. ఈ క్రమంలో అటు వైపు వెళ్లే పలువురు రైతులు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసులు సంబంధిత అధికారులకు సమాచారం అందించగా ఎస్‌డీఈ చిన్నయ్య, జేటీవో అశోక్‌కుమార్, లైన్‌మెన్ సంఘటనా స్థలంకు చేరుకున్నారు. వరద కాలువ వెంబడి కోసిన కేబుల్‌ను దాచి ఉంచినట్టు కనిపెట్టారు. సుమారు వంద మీటర్ల మేర రూ. 60 వేల విలువైన కేబుల్ కోసి వేసినట్టు అధికారులు అంచనాకు వచ్చారు. పోలీసులు కేబుల్‌ను చోరీ చేసిన దొంగలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది.

బకాయిలు వసూళ్లపై దృష్టి సారించాలి

రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం



సిరిసిల్ల, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వాహనదారుల నుంచి రావాల్సిన పన్నుల బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉమ్మడి వరంగల్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం సూచించారు. మంగళవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమాసిక పన్నులను సకాలంలో చెల్లించే విధంగా వాహన దారులకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిలో యువకులే ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో ప్రమాదాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అద్దె భవనంలో ఉన్న కార్యాలయం అనువుగా లేదని వాహనాదారులు తమ దృష్టికి తీసుకవచ్చారని తెలిపారు. కార్యాలయాన్ని అన్ని సౌకర్యాలతో ఉండే భవనంలోకి మారుస్తామని తెలిపారు. తనిఖీల్లో జిల్లా రవాణా అధికారి లక్ష్మణ్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యాపారి ఆత్మహత్య


రాజేందర్(ఫైల్)

మెట్‌పల్లి , ఆగస్టు 13 (ఇబ్రహీంపట్నం): పట్టణంలోని ఓ రెస్టారెంట్‌లో మంగవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణానికి చెందిన బాలి రాజేందర్(48) అనే వ్యాపారి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాజేందర్ బోధన్ పట్టణంలో 11 సంవత్సరాలుగా సిమెంట్, ఇనుము వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. సోమవారం బోధన్ నుంచి కోరుట్లలోని తన బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి కావడంతో ఇంటికి వెళ్లలేక పట్టణంలోని ఓ లాడ్జిలో గది తీసుకున్నాడు.

మంగళవారం ఉదయం 3 గంటల సమ యంలో ఓ వాట్సప్ గ్రూప్‌లో, తన భార్య శిరీషకు ఆర్థిక ఇబ్బందుల వల్ల తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు మెసేజ్ పంపాడు. అప్రమత్తమైన కు టుంబ సభ్యులు, స్నేహితులు 100 కాల్‌తో పాటు మెట్‌పల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు లాడ్జికి వెళ్లి చూసేసరికి రాజేందర్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుని ఉన్నాడు. ఆర్థిక ఇబ్బందుల వల్లే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రాజేందర్ రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే తనను ఇద్దరు మోసం చేశారని, 15 సంవత్సరాలుగా డబ్బులు ఇస్తానని ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆ ఇద్దరి వల్లే తనకు ఈ పరిస్థితి వచ్చిందని ఇద్దరు పేర్లు సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. అదే విధంగా పలు యాప్‌లలో భార్యకు తెలియకుండా లోన్లు తీసుకున్నాడని వాటి ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తన కూతురు, కొడుకును స్నేహితులు ఆదుకుని ఉన్నత చదువులకు సహకారం అందించాలని అందులో కోరాడు. వ్యాపారి రాజేందర్‌ది స్వస్థలం మల్లాపూర్ మండలం మొగిలిపేట కాగా 15 ఏళ్ల క్రితమే బోధన్ వెళ్లి అక్కడే స్థిరపడినట్లు స్నేహితులు తెలి పారు. భార్య శిరిష ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. మృతుడికి ఎంత అప్పు ఉన్నాదనేది పూర్తి స్థాయిలో విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మిడ్‌మానేరుకు కొనసాగుతున్న ఎత్తిపోతలు

రామడుగు/బోయినపల్లి, ఆగస్టు 13: రామడుగు మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి 17వ రోజు నీటి విడుదల కొనసాగుతోంది. మంగళవారం 3,150 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 13.8 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 318 మీటర్లకు ప్రస్తుతం 312.79 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు 16.20 టీఎంసీలు ఉంది. మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6400, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

డెంగ్యూతో వ్యక్తి మృతి


సంపత్‌రావు (ఫైల్)

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 13: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని మెహర్ నగర్‌కు చెందిన వాటర్ ప్లాంట్ యజమాని జూపల్లి సంపత్‌రావు (42) మంగళవారం డెంగ్యూతో మృతి చెందాడు. తంగళ్లపల్లి మండలం వేణు గోపాల్‌పూర్ గ్రామానికి చెందిన సంపత్‌రావు దాదాపు 23 సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం సిరిసిల్ల పట్టణం వచ్చి కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాడు. మోహర్‌నగర్‌లో వాటర్‌ప్లాంట్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. గురువారం తీవ్ర జ్వరం రావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లగా డెంగ్యూ అని తేలింది. ప్లేట్‌లెట్స్ చాలా వరకు తగ్గిపోవడంతో హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు.

ద్విచక్రవాహనాలు ఢీ: ఇద్దరికి గాయాలు

గంభీరావుపేట, ఆగస్టు 13: మండల కేంద్రానికి సమీపాన రైస్‌మిల్ వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో మల్లారెడ్డిపేటకు చెందిన కందుకుల నవీన్, నర్మాలకు చెందిన ద్యానబోయిన సురేష్ తీవ్రంగా గాయపడ్డారు. మల్లారెడ్డిపేట నుంచి నవీన్ గంభీరావుపేట మండల కేంద్రానికి వస్తుండగా, లింగన్నపేట నుంచి మండల కేంద్రానికి వస్తున్న సురేష్ బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన వీరిద్దరినీ ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్తంభాన్ని ఢీ కొట్టిన ట్రాక్టర్

డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో ప్రమాదం

మెట్‌పల్లి , ఆగస్టు 13(ఇబ్రహీంపట్నం): పట్టణంలోని చైతన్యనగర్‌లో మంగళవారం ఓ ట్రాక్టర్ డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో స్తంభం విరిగిపడింది. స్థానికుల వివరాల ప్రకారం పట్టణానికి చెందిన డ్రైవర్ చైతన్య నగర్ ప్రధాన వీధి గుండా వెళ్తుండగా డ్రైవింగ్ చేస్తున్న డ్రైవర్‌కు హఠాత్తుగా ఫిట్స్ రావాడంతో ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో స్తంభం సగ భాగం విరిగి ట్రాక్టర్‌పై పడింది. గమ నించిన స్థానికు లు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫర నిలిపి వేయడంతో ప్రాణాపాయం తప్పింది. అపస్మారక స్థితిలోకి వెళ్లిన ట్రాక్టర్ డ్రైవర్‌ను స్థానికులు ప్రథమ చికిత్స అందించడంతో ప్రాణాలతో బయట పడ్డాడు.

గురుకుల పాఠశాలలో ఏసీబీ తనిఖీలు

అసౌకర్యాలపై ఆరుగంటలు పరిశీలన



గురుకుల పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి, వంటశాలను పరిశీలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 13: సిరిసిల్ల పట్టణం పెద్దూరులోని ఇప్పలపల్లి మహాత్మజ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో హైదారాబాద్ ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సోదాలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో నెలకొన్న అసౌకర్యాలపై ఏక కాలంలో ఏసీబీ, ఫుడ్‌సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఇందులో భాగంగానే ఇప్పలపల్లి మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో దాదాపు 6 గంటల పాలు తనిఖీలు నిర్వహించారు. అద్దెభవనంలో ఉన్న ఈ పాఠశాలలో పరిశుభ్రత, ఆహారం, 356మంది విద్యార్థులకు సరిపడా సదుపాయాలను, హాస్టల్‌లో రికార్డులు పరిశీలించారు. వంటశాలలో ఆహార నిల్వలు, తయారీ, నిర్వహణ, రికార్డుల ప్రకారం విద్యార్థుల హాజరును పరిశీలించారు. పాఠశాలలోని 19 మంది అధ్యాపకులు విద్యార్థులతో ఎలా ఉంటున్నారని ఆరా తీశారు. కాంట్రాక్టరు ప్రతిరోజు విద్యార్థులకు నాణ్యతతో కూడిన ఆహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలలో నెలకొన్న స్థితిగతులపై అధ్యయనం చేసి రాష్ట్ర ఏసీబీ డీజీకి నివేదిక సమర్పిస్తామని ఏసీబీ డీఎస్పీ ఉదయ్‌రెడ్డి తెలిపారు. ఈ తనిఖీల్లో ఫుడ్ ఇన్స్‌పెక్టర్ అనూష, సానిటరీ ఇన్స్‌పెక్టర్ సత్య నారాయణ, లీగల్ మెట్రాలజీ అధికారిణి భూలక్ష్మి, ఆడిటర్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 13: స్థానిక సంస్థల ఎన్నికల పోటీకి సిద్ధం కావాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. సీపీఐ పెద్దపల్లి జిల్లా నిర్మాణ కౌన్సిల్ సమావేశం పెద్దపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కడారి సునీల్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చాడ వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని ఉసి గొలుపుతున్నదని, దేశ సమగ్రతకు ఐక్యతకు భంగం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి అడ్డగోలు షరతులు కండిషన్లు పెట్టి హామీల అమలుకు అడ్డుగా చూపెటవద్దన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ రెండు లక్షల రూపాయలు పూర్తిగా తెల్లరేషన్ కార్డు లింక్ లేకుండా రైతుల పాస్‌బుక్ ఆధారంగా రైతుల రుణమాఫీ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతు బంధును వెంటనే అమలు చేయాలని రైతుల పెట్టుబడులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. తెల్లరేషన్ కార్డులకు వ్యవసాయ భూములు మాగాని, చెలుక రకరకాల ఇబ్బం దులు పెట్టొద్దన్నారు. సెప్టెంబరు నెలలో జరగబోయే స్థానికసంస్థలు, సర్పంచ్ ఎన్నికల్లో పోటీకి పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, గోష్కు మోహన్, గౌతమ్ గోవర్ధన్, కే కనకరాజు టి మల్లయ్య కోడం స్వామి, గట్టయ్య, రాజమౌళి, పసుల మల్లారెడ్డి, ఆల శ్రీనివాస్‌రెడ్డి, ఓదమ్మ రమ, శంకర్, మానస్, ప్రీతం, టి లక్ష్మణ్, సీపీఐ అనుబంధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

షీటీంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న మహిళా ఠాణా సీఐ శ్రీలత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 13: కరీంనగర్ వాగేశ్వరి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కరీంనగర్ మహిళా ఠాణా సీఐ, షీటీం ఇన్‌చార్జి పి.శ్రీలత హాజరై మహిళల భద్రత, సమస్య పరిష్కారంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. మహిళల భద్రతే లక్ష్యంగా పనిచేస్తున్న షీటీంను కళాశాలల చైర్మన్ బీవీఆర్ గోపాల్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో షీటీం ఏఎస్‌ఐ విజయమణి, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకట్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమణ, ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ స్వప్న, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కావేటి పరమేశ్వర్‌కు అయ్యప్ప సేవారత్న అవార్డు


అవార్డు అందుకుంటున్న పరమేశ్వర్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 13: జిల్లా కేంద్రానికి చెందిన అయ్యప్ప దీక్షాపరుడు కావేటి పరమేశ్వర్ గురుస్వామికి మంగళవారం తమిళనాడు కాంచీపురంలో జరిగిన 'అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ' కౌన్సిల్ సమావేశాల్లో అయ్యప్ప సేవారత్న అవార్డు ప్రదానం చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 18 మంది గురు స్వాములకు ఈ అవార్డులను శబరిమల అయ్యప్ప ఆలయ మాజీ మేల్ శాంతులు శశికుమార్, దామోదరన్ నంబూద్రి చేతుల మీదుగా ఈ అవార్డులను అందించారు. సంస్థ ఫౌండర్, మేనేజింగ్ ఫౌండర్ ట్రస్టీ పిఎస్‌కె మీనన్, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయ్యప్పదాస్, బేతి తిరుమలరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన దీక్షాపరులు, భక్తులు పాల్గొన్నారు.

వీధి కుక్కల సర్వే

-కరీంనగర్ రూరల్ మండలంలో 1,745 గుర్తింపు

-నియంత్రణ చర్యల్లో అధికారులు విఫలం

కరీంనగర్ రూరల్, ఆగస్టు 13: కరీంనగర్ మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో వీధి కుక్కలపై సర్వే నిర్వహించారు. మండలంలో మొత్తం 1,745 కుక్కలున్నాయని సర్వేలో తెలిపారు. ప్రధానంగా జూబ్లీనగర్, మందుల పల్లి, నగునూర్, బొమ్మకల్, మొగ్దుంపూర్, దుర్శేడ్, చామనపల్లి, చెర్లబూత్కూర్‌లలో అధికంగా ఉన్నాయని సర్వేలో తేలింది. వీధి కుక్కల గణన పర్యవేక్షణ బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఈనెల 5నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన స్వచ్ఛదనం-పచ్చదనంలో కార్యక్రమంలో భాగంగా క్రూరమైన కుక్కలు ఉన్న ప్రాంతాలను గుర్తించి పశుసంవర్ధక శాఖ అధికారుల సమన్వయంతో నియంత్రణ చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. అయినా సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోక పోవడంతో కుక్కల బెడదతో గ్రామస్థులు సతమతమవుతున్నారు. కుక్కల బారిన పడి చిన్నారులపై దాడులు చేసిన సంఘటనలు ఇటీవల నగర శివారు ప్రాంతాల్లో చోటు చేసుకున్నప్పటికీ వాటిని నియంత్రణ చర్యలు మాత్రం తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వెంటనే వీధి కుక్కల నివారణ చర్యలు చేపట్టి వాటి బారి నుంచి కాపాడాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పల్లె ప్రకృతివనాన్ని పరిరక్షించాలి

రామడుగు, ఆగస్టు 12: గోపాల్‌రావుపేట గ్రామంలో పల్లె ప్రకృతి వనాన్ని సంబంధిత అధికారులు పరిరక్షించాలని జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి కోరారు. మంగళవారం గ్రామంలోని పల్లె ప్రకృతి వనానికి సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లె ప్రకృతివనంలోని మొక్కలను ధ్వంసం చేశారని, ముళ్ల కంచెను తొలగించారని ఆరోపించారు. అలాగే గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారని, పురాతనమైన ఆలయాన్ని ధ్వంసం చేస్తున్నారని, బలహీన వర్గాలకు చెందిన సుమారు 5 కోట్ల భూమిని ఆక్రమించుకొని సాగు పనులు చేస్తున్నారన్నారు. దీనిపై సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

నిర్లక్ష్యానికి నిదర్శనం

చొప్పదండి, ఆగస్టు 13: మండలంలో పెద్ద కుర్మపల్లి గ్రామంలోని తాళ్లకుంటలో విద్యుత్ స్తంభం వంగిపోయింది. రెండు నెలలు క్రింద విద్యుత్ స్తంభం పక్కకు ఒరిగిపోయి ప్రమాదకరంగా మారినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. స్తంభం వంగినా విద్యుత్ ప్రసారం యథావిధిగా కొనసాగుతోంది. ఏదైనా ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని సరి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.


నీటిలో వంగిపోయి ప్రమాదకరంగా ఉన్న స్తంభం

బీమా కోసం 25లోగా దరఖాస్తు చేసుకోవాలి

హుజూరాబాద్, ఆగస్టు 13: ఈ శ్రమ్ కార్డు కలిగి ఉండి ప్రమాదవశాత్తు మృతి చెందిన వారి కుటుంబ సభ్యులు బీమా కోసం ఈ నెల 25లోపు దరఖాస్తులు చేసుకోవాలని హుజూరాబాద్ లేబర్ ఆఫీసర్ డి చందన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు హుజూరాబాద్ ఉప కార్మిక శాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రెండు లక్షలు, అంగవైకల్యం పొందితే లక్ష రూపాయల ఇన్సూరెన్స్ వర్తిస్తుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు మరణ ధ్రువీకరణ పత్రం, పోస్టుమార్టం రిపోర్టు, ఎఫ్‌ఐఆర్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా బుక్, ఈ శ్రమ్ కార్డు రెండు సెట్ల జిరాక్స్‌తో ఈ నెల 25లోగా కరీంనగర్‌లోని మంకమ్మతోట కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

గంగాధర, ఆగస్టు 13: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి పథకం పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. గంగాధర ఎంపీడీవో కార్యాలయంలో 20 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనుపమ, ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిరుమల్‌రావు పాల్గొన్నారు.

పురుగుల మందుల వాడకంతో భూసారం తగ్గుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు

జమ్మికుంట రూరల్, ఆగస్టు 13: పురుగుల మందుల వాడకం వల్ల భూసారం తగ్గడంతోపాటు వాతవరణం కాలుష్యమవుతుందని కేవీకే సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం జమ్మికుంట ప్రకాశం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో కృషి జాగరణ్, భారతీయ వ్యవసాయ పరిశోధన్ మండలి ఆధర్యంలో మిలినీయర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా ఉత్సవాల్లో భాగంగా రైతులకు శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ పత్తి, వరి పంటల్లో ప్రస్తుత వాతవరణాన్ని అనుసరించి ఎటువంటి సేద్య, సస్యరక్షణ చర్యలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి, శాస్త్రవేత్తలు జె విజయ్, జి వేణుగోపాల్, ఆలేటి ప్రశాంతి, ఎల్ మహేష్, మేనేజర్ నవ్యత పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థుల మృతిపై విచారణ చేపట్టాలి

భగత్‌నగర్, ఆగస్టు 13: గురుకులంలో విద్యార్థుల మృతిపై న్యాయ విచారణ చేపట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని కమాన్ చౌరస్తాలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురుకులాల సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకులాల్లో చనిపోతున్న విద్యార్థుల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎనిమిది నెలల కాలంలో గురుకులాల్లో ముప్పైకి పైగా విద్యార్థులు మరణించారన్నారు. మెట్‌పల్లిలోని గురుకులంలో ముగ్గురు విద్యార్థులు విషపూరిత పాములు కుట్టి మరణించడం జరిగిం దన్నారు. దానిపై ఇప్పటి వరకు ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించక పోవడం బాధాకరమన్నారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం లేక రక్తహీనతతో బాధపడుతున్న పరిస్థితులు ఉన్నాయన్నారు. ఫుడ్ పాయిజనింగ్‌కు గురవుతున్నా స్పందించడం లేదన్నారు. నాసిరకమైన కూరగాయలు తీసుకువచ్చి విద్యార్థులకు పెడుతున్నారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు రోహిత్, జిల్లా సహాయ కార్యదర్శి అసంపెల్లి వినయ్, నాగుల శ్రీజ, జిల్లా కమిటీ సభ్యులు సందేశ్, రాకేష్, గట్టు ఆకాశ్, నాయకులు రణబీర్‌సింగ్, రాము, విష్ణు, శివ, సాత్విక్, రాజేష్, రిజ్వాన, సుస్మిత, లిఖిత, మల్లిక, నాగలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


కమాన్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పేదలకు వరం సీఎం రిలీఫ్‌ఫండ్

భగత్‌నగర్, ఆగస్టు 13: పేదలకు సీఎం రిలీఫ్‌ఫండ్ వరమని కొత్తపల్లి తాజా మాజీ వైస్ ఎంపీపీ భూక్య తిరుపతి నాయక్ అన్నారు. కొత్తపల్లి మండలంలోని చింతకుంటలో సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైన 25 మందికి మంగళవారం చెక్కులు పంపిణీ చేశారు.

సామూహిక మంగళగౌరీ వ్రతాలు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 13: స్థానిక అశోక్‌నగర్ మళయాళ సద్గురు గీతామందిర సన్యాసమఠంలో శ్రావణ మంగళవారం సందర్భంగా మఠాధిపతి విష్ణుసేవానందగిరి స్వామి ఆధ్వర్యంలో సామూహిక మంగళగౌరీ వ్రతాలు నిర్వహించారు. లలితాదేవి అమ్మవారికి అభిషేక, అర్చనలు, అలంకారం చేశారు. కార్యక్రమంలో అర్చకుడు చల్లూరి విష్ణుమూర్తిశర్మ, బండ సత్తయ్య, గుండ రాధాకిషన్, కొండ శివలింగం, బొజ్జ రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

సుభాష్‌నగర్, ఆగస్టు13: ప్రపంచ అవయవదాన దినోత్సవం సందర్భంగా రిటైర్డ్ ప్రిన్సిపాల్, కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి 59వసారి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ వైద్యుడు డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి మాట్లాడుతూ మధుసూదన్‌రెడ్డి 59వ సారి రక్తదానం చేసి నేటి యువతకు ఆదర్శంగా నిలిచారని అన్నారు. అంతర్జాతీయ లయన్స్‌క్లబ్ వేదికగా ఎన్నో సమాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించారని తెలిపారు. ఈసందర్భంగా శాతవాహన లయన్స్‌క్లబ్ ఆర్‌సి సత్యనారాయణ, అధ్యక్షుడు సిహెచ్ రాంమోహన్‌రావు, కోశాధికారి పి సురేందర్, కె సత్యం తదితరులు ఆయనను సన్మానించారు.

'వాగేశ్వరి'లో అవగాహన సదస్సు

తిమ్మాపూర్, ఆగస్టు13: స్థానిక వాగేశ్వరి కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మంగళవారం జాతీయ సేవా పథకం, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల జనరల్ సెక్రెటరీ జి.శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి యాంటీ నార్కోటిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఎస్.ఉపేందర్ ముఖ్య అతిథిగా హాజరై డ్రగ్స్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. డ్రగ్స్‌తో కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి నట్లు తెలిపారు. డ్రగ్స్ సంఘటనలు వాటిపై నమోదయ్యే కేసులపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. కార్యక్ర మంలో నార్కోటిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.కృష్ణమూర్తి, తిమ్మాపూర్ సీఐ స్వామి, ఎస్సై చేరాలు, కళాశాల జాయింట్ సెక్రెటరీ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు వినోద్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్ హయాంలోనే ప్రాజెక్టుల నిర్మాణం'

హుజూరాబాద్, ఆగస్టు 13: రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులు కాంగ్రెస్ పార్టీయే కట్టిందని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు సొల్లు బాబు అన్నారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పదేళ్ల అధికారంలో ఉండి ఒక్క ప్రాజెక్టు కూడా కట్టలేదన్నారు. కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు మధ్యలోనే కృంగిపోయిందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు కాంగ్రెస్ వాళ్లు పరాన్న జీవులని మంత్రులను ఎద్దేవా చేసినట్లు మాట్లాడడం సిగ్గు చేటన్నారు.

ప్రమాదకరంగా మూలమలుపు

-ఏపుగా పెరిగిన చెట్లతో కనిపించని సూచిక బోర్డులు -తరచుగా రోడ్డు ప్రమాదాలు

కరీంనగర్ రూరల్, ఆగస్టు 13: కరీంనగర్ రూరల్ మండలం ఇరుకుల్ల వద్ద రాజీవ్ రహదారిపై మూల మలుపు ప్రమాదకరంగా తయారైంది. దీంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. కరీంనగర్ మండలం దుర్శేడ్, ఇరుకుల్ల గ్రామం నుంచి రాజీవ్ రహదారి మధ్యలో నాటిన మొక్కలు ఏపుగా పెరుగగా రాజీవ్ రహదారి మూల మలుపు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో ఇరుకుల్ల బ్రిడ్జి సమీపంలో సూచిక బోర్డులు కూడా కనబడకుండా చెట్ల మధ్యలోనే ఉండి పోతున్నాయి. దుర్శేడ్ గ్రామం చౌరస్తా నుంచి ఇరుకుల్ల గ్రామ స్టేజి వరకు రహదారికి ఫోర్‌లైన్ వేయాల్సి ఉండగా గతంలోనే భూ సేకరణ కూడా చేశారు. రైతులకు పరిహారం కూడా ప్రభుత్వం చెల్లించింది. ఈ రహదారి ఫోర్‌లైన్ వేయకుండానే అలానే ఉంది. దీంతో ఆ ప్రాంతంలో భూసేకరణ చేసిన స్థలాన్ని కూడా క్రయ విక్రయాలు కూడా జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. డివైడర్ మధ్యలో ఉన్న మొక్కల నిర్వహణ చేపట్టి సూచిక బోర్డులు కనబడేలా చేయాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.


దుర్శేడ్ గ్రామం వద్ద ప్రమాదకర మూల మలుపు

అక్టోబరు 19 నుంచి ఆకాష్ 'ఆంథే-24' పరీక్షలు

-ఆకాష్ రీజినల్ సేల్స్ అండ్ గ్రోత్ హెడ్ భరత్‌కుమార్



స్కాలర్‌షిప్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యాసంస్థ ప్రతినిధులు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 13:ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ జాతీయ స్కాలర్‌షిప్ పరీక్ష ఆకాష్ నేషనల్ టాలెంట్ హంట్ ఎగ్జామ్ ('ఆంథే-24) లను అక్టోబర్ 19 నుంచి 27 వరకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆకాష్ రీజినల్ సేల్స్ అండ్ గ్రోత్ హెడ్ భరత్‌కుమార్ తెలిపారు. మంగళవారం కరీంనగర్‌లోని ఆకాష్ ఇన్‌స్టిట్యూషన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆంథే-24 పోస్టర్‌ను లాంచనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ అమిత్‌కుమార్, ఏరియా బిజినెస్ హెడ్ ఇ.రవి, అకాడమిక్ డైరెక్టర్ అంజన్‌కుమార్, బ్రాంచి హెడ్ పెద్దినిరంజన్‌కుమార్ మాట్లాడుతూ తమ సంస్థ ఈ స్కాలర్‌షిప్ పరీక్షను 15 సంవత్సరాల నుంచి నిర్వహిస్తోందన్నారు. 7వ తరగతి నుంచి ఇంటర్ సెకండ్ ఈయర్ తరగతి విద్యార్థులకు గణనీయమైన నగదు అవార్డులతో పాటు 100శాతం స్కాలర్‌షిప్ పొందే అవకాశాన్ని ఆంథే అందిస్తుందని చెప్పారు. ఈ సంవత్సరం ఈ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురు విద్యార్థులకు యుఎస్ఏలోని ఫ్లోరిడాలోని కెన్నెడీ స్పేస్ సెంటర్‌కు ఐదు రోజుల అన్ని ఖర్చుల చెల్లింపుతో కూడిన పర్యటనను కూడా అందిస్తున్నామని ప్రకటించారు. ఆకాష్ సీఈవో, ఎండీ వీడియో కాన్ఫరెన్సులో దీపక్ మెహ్రోత్రా మాట్లాడుతూ 2017 నుంచి ఏడేళ్లుగా కరీంనగర్ ఆకాష్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు, ఆంథే పరీక్షల్లో మెరిట్ సాధించిన విద్యార్థులు ప్రతియేడు డాక్టర్లు, ఐఐటీ, ఎన్ఐటీల్లో అత్యుత్తమ ర్యాంకులతో సీట్లు సాధించారని చెప్పారు. ఆంథే పరీక్షను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో గంట సేపు పరీక్ష ఉంటుందని, రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలన్నారు. ఆగస్టు 15లోగా ఫీజు చెల్లిస్తే వారికి రిజిస్ట్రేషన్‌లో 50శాతం రాయితీ ఇస్తున్నామని చెప్పారు. గోదావరిఖని, జగిత్యాలలో కూడా ఆంథే పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఈ అవకాశాలను ఉమ్మడి జిల్లాలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలి

హుజూరాబాద్, ఆగస్టు 13: హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరవేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం హుజూరాబాద్ పట్టణంలోని ఆయన ఇంటిపై జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో పైళ్ల వెంకట్‌రెడ్డి, తూర్పాటి రాజు, తూముల శ్రీనివాస్, సంపత్, సంతోష్, సారంగపాణి, కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.

- పట్టణంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు గంగిశెట్టి రాజు ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గంగిశెట్టి ప్రభాకర్, కొలిపాక వెంకటేష్, తూర్పాటి రాజు, తూముల శ్రీనివాస్, శశిధర్, సంజీవరెడ్డి, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

● మానకొండూర్: మానకొండూర్‌లో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం తిరంగా యాత్ర నిర్వహించారు. మండల కేంద్రంలోని హన్మాన్ ఆలయం నుంచి తూర్పు దర్వాజ బస్టాండ్ మీదుగా పల్లెమీద బస్టాండ్ వరకు యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రంగు బాస్కరాచారి, మండల అధ్యక్షుడు ఆర్ ప్రవీణ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రావుల శంకరాచారి పాల్గొన్నారు.

● ఇల్లందకుంట: మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో అన్ని పార్టీల నాయకులు త్రివర్ణ పతాక ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడి, బింగి కరుణాకర్, కంది దిలీప్‌రెడ్డి, కంకణాల సురేందర్‌రెడ్డి, మడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

● హుజూరాబాద్‌రూరల్: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగరేసి ప్రజలు దేశభక్తిని చాటుకోవాలని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాంపూర్ గ్రామంలో తపాల శాఖ తరపున హర్‌ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగ ంగా జాతీయ జెండాను ఎమ్మెల్యే, మాజీ ప్రజాప్రతినిధులకు పెద్దపల్లి తపాల శాఖ సూపరింటెండెంట్ ప్రభాకర్ అందజేశారు.


హుజూరాబాద్‌లో జాతీయ జెండాను ఎగరవేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

● జమ్మికుంట: పట్టణంలో బీజేపీ నాయకులు జాతీయ జెండాలతో తిరంగా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, శీలం శ్రీనివాస్, జీడి మల్లేష్, ఆకుల రాజేందర్, కొరె రవి, దొంతుల రాజ్‌కుమార్, పల్లపు రవి, రాజేష్ ఠాకూర్, కొలకాని రాజు, అప్పం మధు, మోతె స్వామి, తుడి రవిచంద్రారెడ్డి, కైలాస్‌కోటి గణేష్ పాల్గొన్నారు.

● శంకరపట్నం: మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు మాడ వెంకట్‌రెడ్డి, అలివేలు సమ్మిరెడ్డి, దండు కొంరయ్య, నరేందర్, అశోక్, శ్రీనివాస్, అర్జున్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

'జ్యోతిష్మతి'ని సందర్శించిన లూసియానా టెక్ యూనివర్సిటీ డైరెక్టర్



జేఆర్ లిగాన్‌ను సన్మానిస్తున్న జువ్వాడి సాగర్‌రావు

తిమ్మాపూర్, ఆగస్టు 13: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి కళాశాలను అమెరికాలోని లూసియానా టెక్ యూనివర్సిటీ ఇంటర్నేషనల్ అఫైర్స్ డైరెక్టర్ జేఆర్ లిగాన్ మంగళవారం సందర్శించారు. ఆయనకు జ్యోతిష్మతి చైర్మన్ జువ్వాడి సాగర్ రావు, సెక్రటరీ, కరస్పాండెంట్ జువ్వాడి సుమిత్‌సాయి స్వాగతం పలికారు. విద్యార్థులకు జేఆర్ లిగాన్ గ్రాడ్యుయేట్ డిగ్రీ ప్రోగ్రాంలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేఎస్ రావు, డీన్ అకాడమిక్స్ పీకే వైశాలి పాల్గొన్నారు.

కేజీబీవీలో ఉద్యోగానికి దరఖాస్తుల ఆహ్వానం

మానకొండూర్, ఆగస్టు 13 : మండంలోని శ్రీనివాస్‌నగర్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈవో మధుసూదనాచారి ఒక ప్రకటనలో తెలిపారు. మహిళ హెడ్ కుక్ పదో తరగతి, అసిస్టెంట్ కుక్ ఏడో తరగతి ఉత్తీర్ణులై మండలానికి చెందిన వారై ఉండాలని ఆయన తెలిపారు. ఈ నెల 16లోపు ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు.

చొప్పదండిలో మంగళూర్ అధికారుల బృందం

చొప్పదండి, ఆగస్టు 13: చొప్పదండి ప్రాథమిక సహకార సంఘాన్ని కర్నాటక రాష్ట్రం మంగళూరు అధికారుల బృందం మంగళవారం సందర్శించింది. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, కేడీసీసీ డీజీఎం ఇంతియాజ్ అలీ, కేడీసీసీ బ్రాంచ్ మేనేజర్ మనోజ్ కుమార్, ప్యాక్స్ సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచంపై అవగాహన

చొప్పదండి, ఆగస్టు 13: చొప్పదండిలో గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచంపై ఎక్సైజ్ అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శిక్షకుల ద్వారా కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ మోకు) ఉపయోగించే విధానం, మెళకువలను నేర్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్,సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ విజయభాస్కర్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

న్యాయం చేయాలని భర్త ఇంటి ఎదుట బైఠాయింపు

శంకరపట్నం, ఆగస్టు 13: తనకు న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళ మండల కేంద్రంలోని తన భర్త ఇంటి ఎదుట మంగళవారం కూతరుతోసహా బైఠాయించింది. తిమ్మాపూర్ మండలం నల్లగొండకు చెందిన శిరీషకు కేశవపట్నం గ్రామానికి చెందిన బొంగోని ప్రవీణ్ కుమార్‌తో 2017లో వివాహం జరిగింది. 2018లో పాప జన్మించింది. అప్పటి నుంచి శిరీషను భర్త పట్టించుకోవడం లేదు. ఈ విషయంపై ఆమె కేసు పెట్టగా ప్రస్తుతం న్యాయస్థానంలో విచారణలో ఉంది. తన భర్త వేరే మహిళతో సహజీవనం చేస్తున్నాడని తెలుసుకున్న శిరీష అతడి ఇంటి ఎదుట బైఠాయించింది తనకు, తన కూతురుకు న్యాయం జరిగే వరకు పోరాడుతానన్నారు. సమాచారం తెలుసుకున్న కేశవపట్నం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వారితో మాట్లాడారు. శిరీషను పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాల్సిందిగా చెప్పారు. పోలీస్ స్టేషన్ వెళ్లిన శిరీషకు ఎస్ఐ కొత్తపల్లి రవి కౌన్సెలింగ్ నిర్వహించారు.


భర్త ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న మహిళ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 13: జిల్లాలో డెంగ్యూ టైఫాయిడ్ జ్వరాలు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. డెంగ్యూ జ్వరాల కారణంగా చాలా మందిలో ప్లేట్‌లెట్లు పడిపోయే ప్రమాదం ఉందన్నారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలతో పాటు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన మందులు సిద్ధంగా ఉన్నాయన్నారు. వైద్యులు, వైద్య సిబ్బంది కూడా అందుబాటులో ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు.

కేంద్ర మంత్రికి సన్మానం

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు13: జిల్లా ఎంపీ, కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌ను డిల్లీలోని ఆయన నివాసంలో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బైకుంత్ సింగ్, సంయుక్త కార్యదర్శి ఈ.శ్రీనివాస్‌లు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని కాయ్ ఇండియా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. 16,17,18 తేదిలలో హర్యానలోని కంచె కుల ఒలంపిక్ భవన్‌లో కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని, ఈ టోర్నమెంట్‌లో దేశంలోని అన్ని రాష్ట్రాలు పాల్గొంటాయని ఈ టోర్నమెంట్‌కు ముఖ్య అతిదిగా హాజరు కావాలని మంత్రిని కోరారు. ఈ సందర్భంగా మంత్రి స్పందిస్తు టోర్నమెంట్‌కు తప్పకుండా వస్తానని హామి ఇచ్చి క్రీడాకారుల గురించి చర్చించి కరాటేను ప్రభుత్వ క్రీడాగా, ఒలంపిక్ క్రీడాగా గుర్తించే విదంగా కృషి చేస్తాడని అన్నాడని తెలిపారు. ఈకార్యక్రమంలో కాయ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, కోశాధికారి సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

'మా వాట మాకే' పుస్తకావిష్కరణ

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 13: చట్ట సభల్లో స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల పోరుపై తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్ రాసిన 'మా వాట మాకే' పుస్తకావిష్కరణ తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం అమర వీరుల స్థూపం, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ విగ్రహం, తెలంగాణ తల్లి విగ్రహం వద్ద ఆవిష్కరించారు. తెలుగు సాహిత్యంలో బీసీ వాద సాహిత్యం 'వెంటాడే కలాలు' అనే పుస్తకంతో ఆరంభమైందని ఆ స్ఫూర్తితో ప్రస్తుతం బీసీ వాద సాహిత్య ఉద్యమాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని అన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ నలిమెల భాస్కర్, గాజోజు నాగభూషణం, బూర్ల వేంకటేశ్వర్లు, అన్నవరం దేవేందర్, కూకట్ల తిరుపతి, సీవీ కుమార్, దామరకుంట శంకరయ్య, సదాశ్రీ, అరుణ్, రవీంద్రాచారి, వనజ తదితరులు పాల్గొన్నారు.

నేడు అల్ఫోర్స్ ఆధ్వర్యంలో తిరంగా సైక్లింగ్ ర్యాలీ

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్ఫోర్స్, కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ (కేడీసీఏ) సంయుక్త ఆధ్వర్యంలో సైక్లింగ్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 6.20 గంటలకు వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జనెనెక్స్ట్ నుంచి తెలంగాణ చౌక్ వరకు ర్యాలీ నిర్వహిస్తారని తెలిపారు. ప్రజలతో పాటు విద్యార్థులు, క్రీడాకారుల్లో దేశభక్తిని ఇనుమడింపచేయడానికి, సైక్లింగ్‌పై ప్రత్యేక ఆసక్తిని పెంచాలని ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. అలాగే ఉదయం 7.30 గంటలకు తెలంగాణ చౌక్ దగ్గర నిర్వహించనున్న సైకిల్ ర్యాలీ ముగింపు కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఈ ర్యాలీలో 6వ తరగతి ఆపై విద్యార్థులు, క్రీడాకారులు, ఆసక్తిగలవారు వారివారి సైకిళ్లతో పాల్గొనవచ్చని ఆయన పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు బియ్యం అందజేత

గన్నేరువరం, ఆగస్టు 13, మండలంలోని హన్మాజిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సంపతి పర్శరాములు ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి కుటుంబసభ్యులను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్ రెడ్డి పరామర్శించి 50కిలోల బియ్యాన్ని అందజేశారు. చీమలకుంటపల్లి గ్రామానికి చెందిని పొలవేని వీరయ్య ఇటీవల మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి బియ్యాన్ని అంద జేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, బామండ్ల ఆంజనేయులు, సంజీవ్, రవి, హరీష్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్లు గందె రాధిక, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, మాజీ ఎంపీపీ రాణి పాల్గొన్నారు.

గురుకులానికి ఫ్యాన్ల అందజేత

గంగాధర, ఆగస్టు 13: మండల కేంద్రంలోని జ్యోతిబాపు పూలే గురుకుల బాలికల పాఠశాలకు మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఎనిమిది ఫ్యాన్లు అందజేశారు. ఇటీవల పాఠశాలను ఆయన సందర్శించిన సమయంలో విద్యార్థినులు ఫ్యాన్లు లేక ఇబ్బందిపడుతున్నామని తెలిపారు. దీంతో పాఠశాలకు ఫ్యాన్లను సమకూర్చినట్లు మాజీ ఎమ్మెల్యే తెలిపారు.

పాడి పరిశ్రమపై అవగాహన

చిగురుమామిడి, ఆగస్టు 13: మండల కేంద్రంలో ఇందిరా మహిళ శక్తి లబ్ధిదారులకు అధికారులు పాడి పరిశ్రమపై మంగళవారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎండీ ఖాజామొయినొద్దీన్, పశు వైద్యాధికారి రమేష్, ఐకేపీ ఏపీఎం మట్టెల సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్ హద్దురాళ్ల తొలగింపు

గన్నేరువరం, ఆగస్టు 13: మండల కేంద్రంలోని సర్వే నంబర్ 330లో ఇటీవల కొందరు వ్యక్తులు ఏర్పాటు చేసిన అనధికార లే అవుట్ వెంచర్‌లోని హద్దురాళ్లను ఎంపీవో డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

శంకరపట్నం, ఆగస్టు 13: మండలంలోని కేశవపట్నంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ఎస్ఐ కొత్తపల్లి రవి వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15న బహుమతులు ఇస్తామని ఎస్ఐ తెలిపారు.

సీజనల్ వ్యాధుల సర్వేపై అవగాహన

శంకరపట్నం, ఆగస్టు 13: సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే నిర్వహణపై ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు కేశవపట్నం పీహెచ్‌సీ ఆవరణలో డాక్టర్ శ్రావణ్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో భాస్కర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వంకాయగూడెం జీపీలో రికార్డుల తనిఖీ

శంకరపట్నం, ఆగస్టు 13: మండలంలోని వంకాయగూడెం గ్రామపంచాయతీలో ఎంపీడీవో కృష్ణప్రసాద్ రికార్డులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని రికార్డుల్లో నమోదు చేయాలన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 12: మండలంలోని రంగాపూర్ నుంచి బదిలీపై వెళ్తున్న కొంకటి శ్రీవిద్యను మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మాజీ సర్పంచ్ బింగి కరుణాకర్ సన్మానించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వనమాల, వీవోలు కవిత, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.